


19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

మంగళవారం 3 ఫిబ్రవరి 2026 పేజీలు 8


## వైసీపీ నేతల బూతులకు..

# కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ జగన్‌రెడ్డే..



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అశాంతి రగల్చేందుకు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. పలు సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ భ్రష్టుపట్టిపోయింది. ఇష్టానుసారంగా మాట్లాడి ప్రజల్ని రెచ్చగొట్టి కులం, మతం ప్రాంతం పేరుతో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఐదేళ్ల అరాచకం తర్వాత ప్రజలు ప్రస్తుతం ప్రశాంతంగా ఉన్నారు. పెట్టుబడులు వస్తున్నాయి. ఉద్యోగ ఉపాధి అవకాశాలతో యువత ఆనందంగా ఉన్నారు. అందుకే రాష్ట్రంలో అలజడులు సృష్టించడం కోసం దిక్కుమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు. కల్తీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన జగన్ రెడ్డి..సిగ్గు లేకుండా నారా లోకేశ్ గురించి తప్పుడు కూతలు కూస్తున్నాడు. మరోవైపు అంబటి రాంబాబు ఆంబోతులా రోడ్డుపై పడి

- కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధి సహించలేక కుట్రలు
- వైసీపీ నేతల వ్యాఖ్యలు చూసి సభ్యసమాజం చీదరించుకుంటోంది
- కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన జోగి రమేష్
- బీసీ కార్డు వాడుకోవడం సిగ్గుచేటు
- పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కిన పేర్ని నాని కూడా నీతులు మాట్లాడుతున్నాడు
- చంద్రబాబు, లోకేశ్ గురించి తేడాగా మాట్లాడిన ఏ ఒక్కర్నీ వదిలేది లేదన్న మంత్రి కొల్లు

మిగతా 2లో...



# జగన్‌వి హింసా రాజకీయాలు..

## సీఎం చంద్రబాబువి శాంతియుత రాజకీయాలు

- కల్తీ మనుషులు, నకిలీ పార్టీ వైసీపీ
- తమ ఇళ్లను తామే తగలబెట్టుకుని వైసీపీ నాయకులు కొత్త డ్రామా
- అంబటి, జోగి రమేష్‌లను పట్టించుకునే స్థితిలో లేము
- ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ ఆధ్వర్యంలో మొదలైన కుట్రలు, కుతంత్రాలు
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

వివరాలు 2లో

## రైజ్‌తో మహిళల వ్యాపార కలలకు రెక్కలు



- ప్రత్యేక కేంద్రంతో మహిళల వ్యాపార శక్తికి సరికొత్త దిశ
- నైపుణ్య శిక్షణ, వనరులను సద్వినియోగం చేసుకోండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ : రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్)తో మహిళల వ్యాపార కలలకు రెక్కలు వస్తాయని.. ఈ కేంద్రంలోని నైపుణ్య శిక్షణతో పాటు 2

### పరిశ్రమలు నెలకొల్పుటకు..

# అన్ని సౌకర్యాలు కల్పించాలి

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : జిల్లాలో అనుమతులు పొందిన పరిశ్రమలు నెలకొల్పుటకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో పరిశ్రమల నెలకొల్పుటపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక అధికారుల వారీగా సమీక్షించారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 237 పరిశ్రమల యూనిట్లు నెలకొల్పుటకు అనుమతులు మిగతా 7లో

## భావవ్యక్తీకరణ స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న మాజీమంత్రులు



- కల్తీ నెయ్యి ఉదంతాన్ని పక్కదోవ పట్టించడానికే కుట్రలు
- జోగి నోటి దూల వల్లే కార్యకర్తలు సహనం కోల్పోయారు
- ఇకనైనా జోగి భాష మార్చుకుని హుందాగా ప్రవర్తిస్తే మంచిది
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ : ప్రజాస్వామ్యంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛను మాజీమంత్రులు దుర్వినియోగం చేస్తున్నారని, కల్తీ నెయ్యి ఉదంతాన్ని పక్కదోవ పట్టించడానికే తీవ్ర అసభ్యకర పదజాలం, జుగుప్సాకర మాటలతో కుట్రలు పన్ని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు. పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యులు వారి కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరులు సమావేశంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ “రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను ప్రజల మనోభావాలు దెబ్బతీసేందుకు అసభ్యకరమైన పదజాలం వాడుతున్నారు. దీని కారణంగా గుంటూరు, ఇబ్రహీంపట్నంలో ఘటనలు చోటుచేసుకున్నాయి. జోగి రమేష్ కల్తీమద్యం కేసులో అరెస్టు అయ్యి 83 రోజుల పాటు జైల్లో ఉండి తన బుద్ధి మార్చుకోలేదు. పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలతో పాటు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌పై కించపరిచే విధంగా మాట్లాడాడు. ఇబ్రహీంపట్నంలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్‌పై మాటకు ముందు అతని దురలవాటులో భాగంగా ఏరా, పోరా..అని మాట్లాడాడు. భారతదేశంలోని సీనియర్ రాజకీయ నాయకుల్లో సీఎం చంద్రబాబు ఒకరు. ఏపీలో ఎక్కవకాలం పాటు చంద్రబాబు సీఎంగా పనిచేశారు. సీఎం చంద్రబాబు పేరును ప్రస్తావిస్తూ మిగతా 7 లో...

(మొదటిపేజీ తరువాయి)



## రైజ్‌తో మహిళల వ్యాపార కలలకు రెక్కలు

అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్వయం సహాయక సంఘ మహిళలకు సూచించారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలోని రైజ్ కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. స్వయం సహాయక సంఘ మహిళలకు రైజ్ కేంద్ర సందర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన 331 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు ఆంత్రప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈడీపీ) కింద వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది ఆర్థికంగా ఎదిగేందుకు చేయూతనివ్వనున్నట్లు తెలిపారు. ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త సంకల్పాన్ని నేరవేర్చేందుకు ఈ రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహిళలకు స్కిల్ డెవలప్మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, సోషల్ మీడియా ప్లాట్ఫామ్ వినియోగం వంటి అంశాలలో పూర్తిస్థాయిలో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. రైజ్ శిక్షణ కేంద్రం నిర్వహణకు మేనేజర్ ను కూడా నియమించామని సెంటర్‌లో ఇంటర్నెట్, కంప్యూటర్ల సౌకర్యం అందుబాటులో ఉన్నాయని.. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మహిళల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతల బూతులకు కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ జగన్ రెడ్డే

(మొదటిపేజీ తరువాయి)



విర్రవీగుతున్నాడు. వంగవీటి రంగా లాంటి మహనీయులతో పోల్చుకుంటూ రాష్ట్రంలో కులాల మధ్య అల్లర్లకు ప్లాన్ చేస్తున్నారు. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కేసిన పేర్ని నాని కూడా నీతులు వల్లిస్తున్నాడు. బియ్యం బొక్కేసి డబ్బు కట్టేస్తే నీతి మంతుడిని అయిపోయాను అనేలా వ్యవహరిస్తున్నాడు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిన జోగి రమేష్ తాను బీసీనని మాట్లాడ్డానికి సిగ్గుపడాలి. ఐదేళ్లు బీసీలపై దాడులు జరిగినపుడు, పీకలు కోసినపుడు ఎక్కడున్నాడని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల వ్యాఖ్యలు, నోటి దురుసు చూసి వీళ్లేం నాయకులని ప్రజలు చీదరించుకుంటున్నారు. గతంలో అధికారంలో ఉండి బూతులు మాట్లాడారు. ఇప్పుడు బూతులు మాట్లాడి రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు.మేము పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నాం కాబట్టి సరిపోయింది. తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణ. నిబద్ధత. అందుకే వైసీపీ నాయకులు ఎన్ని రకాలుగా రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా,టీడీపీ నాయకులు ఎంతో సంయమనంతో ఉన్నారు. మా కార్యకర్తలలో ఆవేశం కట్టలు తెంచుకుంటే.. పరిస్థితిని ఊహించడం కూడా కష్టమనే విషయం వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలి.బూతులు మాట్లాడినోళ్లకు పదవులివ్వాలి అనే నీచ సంస్కృతికి శ్రీకారం చుట్టింది జగన్ రెడ్డే. చంద్రబాబును తిట్టినోళ్లకు పదవులిచ్చాడు. చంద్రబాబు ఇంటిపై దాడి చేసినోళ్లకు పదవులిచ్చాడు. పార్టీ కార్యాలయంపై దాడి చేసినోళ్లను హీరోలుగా కీర్తించాడు.దాడి చేస్తేనే పదవులిస్తామని, బూతులు తిడితేనే గౌరవిస్తారని వైసీపీ నుండి బయటకొచ్చిన నేతలు స్వయంగా చెబుతున్నారంటే వైసీపీలో ఎలాంటి నీచ సంస్కృతి నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు.రాష్ట్రం ప్రశాంతంగా ఉండడం జగన్ రెడ్డికి ఇష్టం లేదు. అభివృద్ధి చూసి జగన్ రెడ్డి కుళ్లుకుంటున్నాడు. చంద్రబాబు కృషితో రాష్ట్రానికి భారీ మొత్తంలో పెట్టుబడులు వస్తుంటే చూడలేకపోతున్నారు. కులం, మతం ప్రాంతాల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలనుకుంటున్నారు. గత ఐదేళ్లు అమరావతి, పోలవరం నిర్వీర్యం చేయాలనుకున్నాడు. తిరుమల దేవస్థానం ప్రసాదాన్ని కూడా కల్తీ చేసిన నీచుడు జగన్ రెడ్డి. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిలో అసలు నెయ్యే లేదని ఎన్ డీ డీ బి నివేదిక బయటపెట్టింది. పామాయిల్, జంతువుల కొవ్వు కలిపి నెయ్యి పేరుతో సరఫరా చేశారని తేల్చారు. నెయ్యి కల్తీ గురించి వైసీపీ నేతలు మాట్లాడే ముందు.. నిబంధనలు ఎందుకు మార్చారో ముందు సమాధానం చెప్పాలి. తమ అనుయాయులకు కాంట్రాక్టులు కట్టబెట్టి జేబులు నింపుకోవడం కోసం నెయ్యి లేని నెయ్యి సరఫరా చేశారు. చుక్క పాలు సేకరించని డెయిరీలకు డెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టారు. ఇప్పుడు నిజాలు బయటకొస్తుండడంతో అరాచకాలకు పూనుకుంటున్నారు. జగన్ రెడ్డి పాలనలో చేసిన అరాచకాలన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తుండడంతో.. రోజుకో రచ్చ చేస్తున్నాడు. రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకుంటాం. అరాచకాలు సృష్టిస్తాం. కులాలు మతాలమధ్య చిచ్చు పెడతామని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకునేది లేదు. తప్పు చేసిన ప్రతి ఒక్కరిపైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపిచంద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, పిప్పళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌వి హింసా రాజకీయాలు..

## సీఎం చంద్రబాబువి శాంతియుత రాజకీయాలు

**కల్తీ మనుషులు, నకిలీ పార్టీ వైసీపీ**

**తమ ఇళ్లను తామే తగలబెట్టుకుని వైసీపీ నాయకులు కొత్త డ్రామా**

**టీడీపీ కార్యకర్తలు ప్రశాంతంగా ధర్నా చేసుకుంటుంటే వైసీపీ నాయకులు రెచ్చగొట్టారు**

**అంబటి, జోగి రమేష్‌లను పట్టించుకునే స్థితిలో లేము**

**ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ ఆధ్వర్యంలో మొదలైన కుట్రలు , కుతంత్రాలు**

**వంగవీటి మోహన రంగా కాపు నాయకుడు కాదు..బడుగు బలహీన వర్గాల నాయకుడు**

**ప్రతీకార రాజకీయాలు వద్దని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు**

**జగన్ రెడ్డి డైరెక్షన్‌లో నడిచే వైసీపీ నాయకులు చిల్లర మాటలు మానుకోవాలని హెచ్చరిక**

విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : కల్తీ మనుషులు, నకిలీ పార్టీ వైసీపీ కి డ్రామాలు ఆడాటం కొత్తకాదని...ఆనాడు బాబాయి హత్య కేసు సమయంలో, కోడి కత్తి డ్రామా, గులకరాయి డ్రామా ఆడారని..ఇప్పుడు రాష్ట్రంలో అలజడలు సృష్టించటానికి పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి డైరెక్షన్ లో వైసీపీ నాయకులు తమ ఇళ్ల ను తామే తగలబెట్టుకుని నింద వేరే వాళ్లపై వేసే సరికొత్త డ్రామాకు తెరదీశారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ పై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీలోని తాజా రాజకీయ పరిస్థితులపై ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడారు.అలాగే మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో తన ఆద్వర్యంలో జోగి రమేష్ ఇళ్లు తగలబెట్టడం జరిగిందని వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్నిఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని, సుమారు 734 పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు రాబోతున్నాయని తెలిపారు. దీని ద్వారా యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. పెట్టుబడుల సాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు రాజకీయంగా అశాంతి సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను భంగం చేసే విధంగా కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి హింసాత్మక రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, మరోవైపు నారా చంద్రబాబు నాయుడు శాంతియుత వాతావరణాన్నే కోరుకుంటున్నారని పేర్కొన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగయ్యే సమయంలో మళ్లీ పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి ఆధ్వర్యంలో



మళ్లీ కుట్రలు కుతంత్రాలు మొదలయ్యాయన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలనే ఉద్దేశ్యంతో వైసీపీ నాయకులతో సీఎం చంద్రబాబు ను అసభ్య పదజాలంతో దూషించి టీడీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా జగన్ ప్రణాళిక రచించాడన్నారు. అయితే తమ నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు సమన్వయంతో వుండాలని దిశానిర్దేశం చేయటం జరిగిందన్నారు.

సైకో మనస్తత్వం కలిగిన వై.ఎస్.జగన్ ఎక్కడ ఆనందంగా వున్న తట్టుకోలేడంటూ...ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందకూడదనే కంకణం కట్టుకుని కొత్త డ్రామాకి తెరదీశాడన్నారు. జగన్ రెడ్డి వైలెన్స్ కోరుకుంటే...సీఎం చంద్రబాబు సైలెన్స్ కోరుకుంటారన్నారు. రాష్ట్రం ప్రశాంతంగా వుండాలి...పెట్టుబడులు రావాలి.. రాష్ట్రం సంక్షేమం. అభివృద్ధి పరంగా ముందుండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు కులాన్ని తీసుకురావటం.. దూరంగా వున్న వ్యక్తులకు లేనిపోని నిందలు ఆపాదించటం వై.ఎస్.జగన్ వికృత చేష్టలకు నిదర్శనమన్నారు. ఆదివారం విజయవాడ లో జరిగిన సంఘటన కి సంబంధించి వైసీపీ నాయకులు కొత్త డ్రామా మొదలుపెట్టారన్నారు. తమ కార్యకర్తలు శాంతియుతంగా ధర్నా చేయటానికి వెళ్లితే....వైసీపీ నాయకులు రెచ్చగొట్టి రాళ్లు విసిరితే..తమ మహిళ కార్యకర్తలకు గాయాలు కావటం జరిగిందన్నారు. సొంత ఇళ్లనే తగలపెట్టుకుని ఎదుటి వారిపై నిందలు వేసేందుకు వైసీపీ నాయకులు కొత్త డ్రామాకి తెరదీశారన్నారు. అదే విధంగా వైసీపీ నాయకులు కాపు నాయకులను రెచ్చగొట్టాలని చూస్తున్నారని, తామంతా అన్నదమ్ములా వుంటామని, విజయవాడ నగరంలో చూస్తే వంగవీటి మోహన రంగా ను కాపు నాయకుడిగా కాదు..బడుగు బలహీన వర్గాల నాయకుడిగా గౌరవించుకుంటున్నామన్నారు. ఆయన చనిపోయిన సమయంలో హత్య రాజకీయాలు చేసి....రక్తసిక్త చరిత్ర వున్న కొందరు విజయవాడ నాయకులు ఇవాళ చూస్తే ఎవరి చుట్టూ వున్నారో అందరికీ తెలుసునన్నారు. వంగవీటి మోహన రంగాను వై.ఎస్.జగన్ తండ్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఎదగనీయకుండా అడ్డుకున్నారని తెలిపారు. రంగా హత్యకేసులో ప్రధాన ముద్దాయిలు అందరూ వై.సి.పిలో పదవులు తెచ్చుకుని విజయవాడ లో తిరుగుతున్నారన్నారు. వైసీపీ నాయకులు జోగి రమేష్, అంబటి రాంబాబు వంటి వారిని పట్టించుకునే స్థాయిలో మంత్రి నారాలోకేష్.. తాను లేమన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రాభివృద్ధి కోసం దేశ విదేశాలు తిరుగుతుంటే...తాను పార్లమెంట్ లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్‌లో ఆదివారం జరిగిన బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనట్లు తెలిపారు.

తన ఆధ్వర్యంలో దాడి జరిగిందని చెబుతున్న వాళ్ల దగ్గర ఎటువంటి ఆధారం లేదన్నారు. తమ పార్టీ కార్యకర్తలు శాంతియుతంగా ధర్నా చేయటానికి వెళ్లారని..అక్కడ వాళ్లని వైసీపీ నాయకులే రెచ్చగొట్టారని తెలిపారు. వైసీపీ నాయకులు చేసిన తప్పులను ఎత్తిచూపుతూ పోలీస్ కమిషనర్ కి తమ నాయకులు వినతి పత్రం కూడా ఇవ్వటం జరిగిందన్నారు. ఆనాడు సీఎం చంద్రబాబు ఇంటిపై, టీడీపీ కార్యాలయంపై, కొమ్మారెడ్డి పట్టాబి రామ్ ఇంటిపై దాడి చేసినప్పుడు ఆ ఇళ్లలో కుటుంబ సభ్యులు, పిల్లలు లేరా? పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు నాయకులు లేరా? అంటూ వైసీపీ నాయకుల్ని ప్రశ్నించారు. వైసీపీ నాయకుడు జోగి రమేష్ ను పట్టించుకునే పరిస్థితిలో తానులేనని. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం దిశగా తీసుకువెళ్లే పనుల్లో మునిగివున్నట్లు తెలిపారు. మైలవరం నియోజకవర్గంతో పాటు .కొండపల్లి రైల్వే స్టేషన్..కొండపల్లి డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం. కృషి చేస్తున్నట్లు తెలిపారు. జోగి రమేష్ పై దాడి చేయించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.జగన్ డైరెక్షన్ లో నడిచే వైసీపీ నాయకులు చిల్లర మాటలు మానుకోవాలని హెచ్చరించారు. అధికారంలో వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు ప్రతీకార రాజకీయాలు వద్దన్నారని...అందుకే 20 నెలల నుంచి తమ పార్టీ నాయకులు ఎంతో ఓపిగ్గా వుంటూ వైసీపీ నాయకుల అరాచకాలను బరిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు , కుటంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషిస్తే.. టీడీపీ కార్యకర్తలు ప్రశాంతంగా ధర్నాచేశారే కానీ ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు పాల్పడలేదన్నారు. వై.ఎస్.జగన్ సతీమణి వై.ఎస్.భారతీరెడ్డి పై సోషల్ మీడియాలో కామెంట్ చేస్తే తమ పార్టీ కార్యకర్త అయినా కూడా వదిలిపెట్టకుండా వెంటనే చర్యలు తీసుకున్న ఘనత సీఎం చంద్రబాబు సొంతమన్నారు. అధికారంలోకి రాగానే విధ్వంసంతోనే వైసీపీ ప్రభుత్వం పరిపాలన మొదలు పెట్టిందని, ఆ సంగతి మర్చిపోయి బొత్స నారాయణ మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు.

ప్రతీకార రాజకీయాలకు తాము దూరమని, రాష్ట్రం శాంతియుతంగా ఉండాలని మాత్రమే కోరుకుంటున్నామని స్పష్టం చేశారు. కోటి సభ్యత్వాలున్న తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అభివృద్ధి, శాంతి మార్గాన్నే అనుసరిస్తుందని తెలిపారు. లోక్‌సభ సమావేశాల కోసం ఢిల్లీలో ఉన్న తాను కూడా విజయవాడ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని, తనపై వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని చెప్పారు.

# స్కిల్ కేసులో కడిగిన ముత్యంలా పైకి వచ్చిన చంద్రబాబు




**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** నిప్పుకు చెద పట్టదు, నీతికి కాలం చెల్లదు, స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఇదే ఋజువైందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఎలాంటి సంబంధం లేని కేసును నాడు జగన్ రెడ్డి అన్యాయంగా ఇరికించి 53 రోజులు జైల్లో నిర్బంధించిన, ఏసీబీ, ఈడి విచారణలో ఎటువంటి ఆధారాలు లేవని, ఈడి కుండ బద్దలు కొట్టి చెప్పడం, చంద్రబాబు నాయుడు నీతి నిజాయితీకి అద్దం పట్టిందని, కడిగిన ముత్యంలా బయటకు బట్టబయలైందనీ హర్షం ప్రకటించారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు గత తెలుగుదేశం ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయని వైసీపీ ప్రభుత్వం ఇసుక మద్యం అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, స్కిల్ డెవలప్మెంట్, అంగళ్ళు కేసులు పెట్టిన అన్ని కేసులు కూడా ఎటువంటి ఆధారాలు లేవని, కేవలం రాజకీయ కక్ష సాధింపులతోనే నాడు చంద్రబాబుని వేధించారని అన్నారు. నాడు జగన్మోహన్ రెడ్డి అండ్ విధ్వంసకారులు ఎన్ని కుట్రల పన్నిన చివరకు సత్యమే గెలిచిందని హర్షం ప్రకటించారు. కూటమి ప్రభుత్వంలో కూడా ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు దేశ విదేశాల్లో ప్రధాన మంత్రి చేత కూడా ప్రశంసలు అందుకుంటున్నారని, ఇది జీర్ణించుకోలేని జగన్ రెడ్డి పేర్ని నాని, అంబటి రాంబాబు, జోగి రమేష్, రోజా రెడ్డి, గుడివాడ అమర్నాథ్ లాంటివారు జగన్ రెడ్డి ప్రాపకం కోసం ప్రాకులాడుతున్నారు తప్ప, ప్రజలలో చులకన అవుతున్న విషయాన్ని మంద బలంతో గమనించలేకపోతున్నారని, తుదకు జైలు పాలు అవుతున్నారని కొల్లూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు..

# ఘనంగా మెర్ల చంద్రశేఖర్ జయంతి వేడుకలు




**గన్నవరం, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలంలోని అజ్జంపూడి గ్రామంలో ఉన్న మెర్ల రామమ్మ మెమోరియల్ మెంటలీ చాలెంజెడ్ ఆశ్రమంలో సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గీయ మెర్ల చంద్రశేఖర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గన్నవరం ఎంపీపీ అనగాని రవి హాజరై కేకును కట్ చేశారు. అనంతరం ఆశ్రమంలోని మానసిక దివ్యాంగులకు, పేదలకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనగాని రవి మాట్లాడుతూ...మెర్ల చంద్రశేఖర్ ఈ ప్రాంత ప్రజల అభ్యున్నతికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. అజ్జంపూడిలో మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి మానసిక దివ్యాంగులకు ఉచిత భోజనం, వసతి, వైద్య సదుపాయాలు కల్పించారని తెలిపారు. కోవిడ్ సమయంలో బాటసారులు, పేదలకు భోజనం పంపిణీ చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. సేవాభావంతో జీవించిన మెర్ల చంద్రశేఖర్ భౌతికంగా దూరమైనా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు. అలాగే ఆయన కుమారుడు వంశీ తండ్రి బాటలోనే మానసిక వికాస కేంద్రాన్ని నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎంపీటీసీ సభ్యులు త్రిపురనేని బాబీ, వైఎస్సార్ సీపీ గన్నవరం పట్టణ అధ్యక్షుడు మోదుగుమూడి వెంకటేశ్వరరావు, వికాస కేంద్రం మేనేజర్ విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# సుస్థిర ఆర్థిక వృద్ధికి చేయూతగా ఆర్‌టీఐహెచ్

## వినూత్న ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు కృషి

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** సీఎం దార్శనికతకు ప్రతిరూపమైన ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని సాకారం చేసేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) అడుగులు వేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఇగ్నైట్ సెల్‌లో ఆర్‌టీఐహెచ్ ఆధ్వర్యంలో మూడు స్టార్టప్‌లు, రెండు ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. సింటాక్స్ లెన్స్, ఈటీ ఆర్గానిక్స్ తదితర సంస్థల ఉత్పత్తులను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించి.. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సహాయసహకారాలను పూర్తిస్థాయిలో అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఓ చిన్న ఆలోచన సరికొత్త ఆవిష్కరణకు, ఆపై విజయవంతమైన పరిశ్రమ స్థాపనకు కారణమవుతుందని.. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్టార్టప్‌లకు సరికొత్త ప్రోత్సాహమిస్తోందన్నారు. ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంటూ యువతను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎనిమిది వేల మందికిపైగా ఔత్సాహికులకు అవగాహన కల్పించామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, అగ్రిటెక్, హెల్త్ టెక్, ఫుడ్ టెక్, ఎడ్యూటెక్ వంటి ఎమర్జింగ్ సాంకేతికతలను ప్రోత్సహించడమే కాకుండా ఆయా రంగాల్లో సుస్థిర ఉపాధి అవకాశాలను సొంతం చేసుకునేలా కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఐహెచ్ స్పోక్ బృంద సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్‌కు డాక్టర్ బీఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ పేర్లు పెట్టండి..



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** పట్టణంలోని కాకాని నగర్ ప్రాంతంలో గల పాత సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల స్థలం ప్రస్తుతం నిరుపయోగంగా మారి శిథిలావస్థలో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగజీవన్ రామ్ మహనీయుల పేర్లతో ఒక ఆధునిక కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరుతూ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు స్థానిక శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ, ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణం ద్వారా సామాజిక, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ముఖ్యంగా ఎస్సీ వర్గాల ప్రజలకు ఇది ఒక శాశ్వత ఆస్తిగా నిలుస్తుందని తెలియజేశారు. అలాగే డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే విధంగా ఈ నిర్మాణం ఉండాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుని కమ్యూనిటీ హాలు నిర్మాణం కొరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



## రవి కుటుంబ సభ్యులను పరామర్శించిన కైలే

**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పాములలంక గ్రామంలో జరిగిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్టూరు రవి తండ్రి పెద్ద కర్మ కార్యక్రమంలో పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. సందర్భంగా రవి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు జొన్నల రామమోహన్ రెడ్డి, పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, తిరుమలశెట్టి వాసుతోపాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కైలే



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అలినకీపాలెం గ్రామంలో స్థానిక ఎంపీటీసీ సజ్జాద్ అలీ తండ్రి పెద్దకర్మ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జాద్ అలి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం అదే గ్రామంలో పలు కుటుంబాలను ఆయన పరామర్శించి ఆ కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ బాబు, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** పట్టణంలో స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ స్వగృహంలో బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. వత్సవాయి మండలం, భీమవరం గ్రామానికి చెందిన గొడితల వెంకటేశ్వర్లు ఇటీవల తీవ్రమైన అనారోగ్యానికి గురై ప్రైవేట్ హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేయించుకుని చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. వారి వైద్య చికిత్సకు సంబంధించిన మెడికల్ బిల్లులను స్థానిక నాయకులు శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకువెళ్లగా, ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. బాధిత కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తమ సిఫార్సు లేఖ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు పంపించగా, అందుకు అనుగుణంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.37,292/- ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా సోమవారం జగ్గయ్యపేటలోని ఎమ్మెల్యే నివాసంలో, మంజూరైన రూ.37,292/- విలువైన చెక్కును శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వయంగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొడితల ఆంజనేయులు, గొడితల శ్రీను, సైదులు, రామ్ భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## డొంక రోడ్డులో జంగిల్ క్లియరెన్స్



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** పిచ్చి చెట్లతో పూడుకుపోయి రైతులకు ఇబ్బందికరంగా మారిన డొంక రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. మండల పరిధిలోని పులిగడ్డ ఒకటి, రెండు వార్డుల మీదుగా కోటగిరి లంక వైపు వెళ్లే డొంక రహదారి పొలం వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది అని రైతులు తెలియజేయడంతో వెంటనే స్పందించిన సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ నేతృత్వంలో సోమవారం జెసిబి ద్వారా జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండల వెంకటేశ్వరరావు, ఇన్చార్జి ఏవో రాంప్రసాద్ వార్డు సభ్యులు చెన్ను రమేష్, బాబురావు, శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదుకు సంతృప్తికరమైన, శాశ్వత పరిష్కారం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అదనపు కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సమస్యకు క్షేత్రస్థాయిలో అధికారులందరూ పరిశీలించాలని, అర్జీదారులకు వారి సమస్యకు శాశ్వతమైన పరిష్కారం అందిస్తామన్న భరోసాని ఇవ్వడమే కాకుండా సత్వరమే అందించేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 20 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 7, ఇంజనీరింగ్ 7, పబ్లిక్ హెల్త్ 4, రెవెన్యూ 1, ఎస్టేట్ 1 మొత్తం కలిపి 20 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) ఏ. రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఐ/సి పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, పర్యవేక్షణ ఇంజనీర్ ( వర్క్స్ ) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, బయాలజీ వి.కామేశ్వరరావు, ఆర్ఎఫ్ఓ మాల్యాద్రి పాల్గొన్నారు.

## ఉన్నత విద్య చదివేందుకు ఆర్థిక సహాయం



**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రులోని నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాల యంలో కోవి ఫౌం డేషన్ సహకారంతో ఎంబిబిఎస్ విద్యార్థిని దోవరి హారిక కు ఆర్థిక సహాయాన్ని శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా చేతుల మీదుగా అందజేశారు. దోవరి హారిక కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండటంతో ఆమె చదువుకునేందుకు అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా కోవి ఫౌండేషన్ ప్రతినిధులు 10వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించిన కోవి ఫౌండేషన్ ప్రతినిధులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, ప్రియదర్శిని మహిళా మండలి అఖిలభారత అధ్యక్షురాలు కె. విజయలక్ష్మి, రమ్య, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్సీయం చర్చి సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్:** మండలంలో పోచంపల్లి గ్రామంలో నిర్వహించిన ఆర్.సి.యం చర్చి సిల్వర్ జూబ్లీ 35వ వార్షికోత్సవ వేడుకల్లో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు, క్రైస్తవ సోదర సోదరీమణులను ఎమ్మెల్యే హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఐక్యత, మతసామరస్యం మన దేశ సంస్కృతికి ప్రతీకలని పేర్కొంటూ, ఇలాంటి వేడుకలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో-కన్వీనర్, పోచంపల్లి గ్రామ సొసైటీ చైర్మన్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, గ్రామ చర్చి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, సంఘ విశ్వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లినిక్ అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టండి



**విజయవాడ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ ద్వారా అందుతున్న అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. పీజీఆర్ఎస్ నాన్ రెవెన్యూ కింద మొత్తం 136 అర్జీలు రాగా వీటిలో పురపాలక శాఖకు 36, పోలీసు శాఖకు 21, పంచాయతీరాజ్‌కు 20 అర్జీలు ఉన్నాయి. డీఆర్డీఏకు 10, గృహ నిర్మాణానికి 6 అర్జీలు రాగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, ఆరోగ్య శాఖకు అయిదు చొప్పున, పౌర సరఫరాలు, ఉపాధికల్పన, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు మూడు చొప్పున అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, విద్యుత్, అడవులు, ఇరిగేషన్, మైన్స్, టూరిజం, ఖజానా శాఖలకు రెండు చొప్పున, సీపీవో, విద్య, గ్రౌండ్ వాటర్, ఐసీడీఎస్, మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా, నైపుణ్యాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, సాంకేతిక విద్య, గ్రంథాలయ శాఖలకు ఒకటి చొప్పున అర్జీలు ఉన్నాయి. రెవెన్యూ క్లినిక్ ద్వారా 75 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రతి అర్జీని క్షుణ్నంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, ఈ కార్యక్రమం అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ నేతల ఇళ్లపై దాడులతో రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితి




**పామర్రు మేజర్ న్యూస్:** వైసీపీ నేతల ఇళ్లపై టీడీపీ కార్యకర్తల దాడులు మరొకపక్క మాజీమంత్రి అంబటి రాంబాబు అరెస్టుల నేపథ్యంలో రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితి నెలకొందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి స్థానిక మాజీ శాసనసభ్యులు అనిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పామర్రులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ శనివారం అంబటి రాంబాబు ఎపిసోడ్ జరిగి 24 గంటలు గడవక ముందే మరో మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడికి దిగడం చూస్తుంటే రాష్ట్రం ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు. జోగి రమేష్ ఇంట్లో భారీగా మంటలు అలుముకుని దట్టమైన పొగ కమ్మేయడంతో అక్కడ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదన్నారు. జోగి రమేష్ ఇంటి ముందు ఫ్లెక్సీలు చించేసి టీడీపీ కార్యకర్తలు హంగామా సృష్టించడం విచారకరమన్నారు. ఈ ఘటనలపై తీవ్రస్థాయిలో వైసీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం రావణకాష్టంలా మారిందని కైలె అనిల్ కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందో ఈ సంఘటనలు నిరూపిస్తున్నాయని, వెంటనే ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



## గుంటుపల్లిలో రజక వృత్తుదారుల సంఘం రౌండ్ టేబుల్ సమావేశం

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చిక్కవరపు వెంకట రెడ్డయ్య ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వృత్తిదారుల సమస్యలపై పలు డిమాండ్లు చేశారు గుంటుపల్లి లో జరిగిన రజక రౌండ్ టేబుల్ సమావేశం లో ముఖ్య అతిథులు రాష్ట్ర సహాయ కార్యదర్శి చిక్కవరపు వెంకట రెడ్డయ్య పాల్గొని పలు అంశాలపై చర్చించి సమస్యల పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని వారు వెల్లడించారు ఈ కార్యక్రమంలో నూతక్కి బాబుజి పార్వతమ్మ సరోజిని బి వసంతరావు సాంబశివరావు తదితరులు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గత వారం రోజులుగా రాష్ట్రంలో ఆటవిక పాలన, రాక్షస పాలన జరుగుతోంది

## మాజీ శాసనసభ్యులు కైలె అనిల్ కుమార్




**పామర్రు మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో జరుగుతున్న తిరుమల లడ్డు వివాదం, వైయస్ఆర్ సీపీ నాయకుల పై జరుగుతున్న దాడులను ఖండిస్తూ పామర్రు పోలీసు స్టేషన్ లో మాజీ శాసనసభ్యులు కైలె అనిల్ కుమార్ వైయస్ఆర్ సీపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేసారు. పార్టీ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్ళి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ కు వినతి పత్రం అందించారు. అనంతరం స్టేషన్ ఎదుట విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ స్వలాభం కోసం చంద్రబాబు నాయుడు ఎంతటికైనా దిగజారుతారనడానికి నిదర్శనం తిరుమల లడ్డు అని పేర్కొన్నారు. కలియుగ దేవుడైన తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు పై కూడా ఆరోపణలు చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజకీయంగా జగన్ మోహన్ రెడ్డిని అణగదొక్కాలని చేసిన కుటిల ప్రయత్నమని విమర్శించారు. హిందూ సమాజాన్ని జగన్ మోహన్ రెడ్డికి దూరం చేయాలనే కుట్రతో కూటమి నాయకులు తిరుమల లడ్డూ పై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేందుకు జంతువుల కొవ్వు కలిపారని జగన్ మోహన్ రెడ్డి పై నిందలు మోపారన్నారు. ఎన్ డిడిబి ల్యాబ్ రిపోర్ట్ తేలిన తర్వాతే ప్రకటించాలని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారని తెలిపారు. ల్యాబ్ కు పంపించిన శాంపిల్ ఎవరి హయాంలో తీసిందో చంద్రబాబు తెలపాలని కోరారు. కూటమి హయాంలో తీసిన శాంపిల్స్‌కి జగన్ మోహన్ రెడ్డి హయాంలో కల్తీ ఉందని బాబు చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎటువంటి సాక్ష్యాలు ఆధారాలు లేకుండానే నిరాధారణమైనటువంటి ఆరోపణలు చేశారని విమర్శించారు. హిందూ మనోభావాలు దెబ్బ తింటుంటే లోతుగా దర్యాప్తు చేయాలంటూ సుప్రీం కోర్టు సిట్ వేసిందన్నారు. సంపూర్ణమైన దర్యాప్తు తర్వాత సీబీఐ సిట్ ఏ జంతువు కొవ్వు కలపలేదని నిర్ధారణ చేశారని తెలిపారు. అత్యున్నత న్యాయస్థానం చెప్పినా కూటమి ప్రభుత్వం నమ్మడం లేదన్నారు.

### చంద్రబాబునాయుడు పవన్ కళ్యాణ్ చెప్పిందే నిజమా..?

కల్తీ జరిగిందన్న చంద్రబాబు చార్జ్ షీట్ లో అప్పటి టీటీడీ పాలకుల పేర్లు, వైయస్ఆర్ సీపీ నాయకుల పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. అసత్యమైన ఆరోపణలను ప్రజలకు చేరవేస్తున్న కూటమి నాయకులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంబటి రాంబాబు, విడుదల రజని, జోగి రమేష్ పై టీడీపీ నాయకులు దాడులు చేయడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. వైయస్ఆర్ సీపీ నాయకులు సంబంధం లేదంటూ ఫ్లెక్సీలను తీసేయాలంటూ అడగడం మా నాయకులు చేసిన తప్పా అంటూ ప్రశ్నించారు. ఫ్లెక్సీలను తీసేయడానికి వెళ్తే పోలీసుల ఎదుట దాడులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వందల మంది టీడీపీ నాయకులు చేరి కట్టెలతో, రాడ్లతో దాడులు చేయడం పాలకుల నిరంకుశత్వానికి అద్దం పడుతోందన్నారు. గ్రంథాలయ చైర్మన్ మహిళ నీజాతి నీచమైన భాషలో మాట్లాడుతుంటే కేసులు లేవా? అంటూ ప్రశ్నించారు. దాడులు జరిగిన వారిపైన ఆర్థికంగా నష్టపోయిన వారిపైన కేసులు పెట్టి జైల్లో పెట్టారని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారని పేర్కొన్నారు. కూటమి నాయకులతో కలిసి పోలీసులు అహింసను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి, కానీ పోలీస్ వ్యవస్థ చిరస్థాయిగా ఉంటుందనే విషయాన్ని మరువరాదన్నారు. అధికారులైనా, రాజకీయ నాయకులైనా రాబోవు రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని అనిల్ కుమార్ ఘాటుగా స్పందించారు.

## డైవర్షన్ రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సింపతి కోసం డైవర్ట్ రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని నారా లోకేష్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు ఘాటుగా విమర్శించారు. మేకావారిపాలెం గ్రామంలో గృహంలో శ్రీనివాసరావు మాట్లాడారు. టిడిపి నేతలు దుర్మార్గాలు చేయరన్నారు. వైసీపీ నేతలు నోటికి వచ్చిన మాట్లాడినా, తమ అధినేత న్యాయపరంగా ముందుకు వెళు తున్నారే గాని వారిని ఏమి అనడం లేదన్నారు. వారు చేసిన తప్పులే వారి రాజకీయ జీవితాలను బలి తీసుకున్నాయని వైసీపీ నేతలను ఉద్దేశించి అన్నారు. కల్తీ మద్యం, దొంగ బియ్యం వ్యాపారం చేసే నేతలు తమ నేతలను దూషిస్తున్నారని దుయ్యబట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వంలో జరిగిన కల్తీ నెయ్యి పై సిట్ అడ్డంగా నివేదిక ఇస్తే, ఆ విషయాన్ని డైవర్ట్ చేయడం కోసం అంబటి రాంబాబు, జోగి రమేష్‌లు ప్రయత్నిస్తున్నారన్నారు. తమ యువ నేత నారా లోకేష్ కు చిప్ పోయిందని జోగి రమేష్ అనడంపై శ్రీనివాసరావు మండిపడ్డారు. జైలు జీవితం గడిపి, అక్రమ మద్యంపై వచ్చే ఆదాయం పోయేటప్పటికీ జోగి రమేష్ కే చిప్ పోయి, మతిభ్రమించి తెలిపారు. అలాగే రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తే రాష్ట్రంలో పెద్ద మొత్తానికి వస్తున్న పెట్టుబడులు, కోకొల్లలుగా వస్తున్న పరిశ్రమలు రావనే నెపంతో వైసీపీ నేతలు ఉన్నారన్నారు. జోగి రమేష్ తన ఇంటిపై తానే దాడులు చేయించుకున్నారన్నారు. జోగి రమేష్ వ్యాఖ్యలకు ధర్నా చేయడానికి మాత్రమే టిడిపి శ్రేణులు రమేష్ ఇంటి వద్దకు వెళ్లారని తెలిపారు. కౌతు లచ్చన్న వంటి మహోన్నత వ్యక్తులు బీసీలలో పుట్టారన్నారు. తెలుగుదేశం పార్టీకి బీసీలే బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు. కుల రాజకీయాలు చేస్తూ, అంబటి రాంబాబును మహానేత వంగవీటి మోహన రంగాతో పోల్చడం సరికాదన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి



**మొవ్వ మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల పరిధిలోని నిడుమోలు, చినముత్తేవి, మొవ్వ గ్రామాల సచివాలయాల వద్ద సోమవారం వినతి పత్రాలను కార్యద ర్శిలకు సమర్పించటం జరిగిందని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరణ చేయాలని, జి రాం జీ పథకాన్ని రద్దు చేయాలని, ఈ పథకానికి కేంద్రమే 90 శాతం నిధులు కేటాయించాలని, రాష్ట్రాలపై భారాలు తగ్గించాలని, కనీస కూలి రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని, కుటుంబానికి పని దినాలు 200 రోజులు పెంచాలని, ఒకే పూట పని చేపించాలని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో 3 లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలని, ఉపాధి హామీ కార్మికుల సమస్యలను కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఉప్పలపు వెంకటాద్రి, పార్టీ సభ్యులు కొనకళ్ళ రాంబాబు, జొన్నలగడ్డ వాసు, దేవరపల్లి మణి, వెంక టలక్ష్మి ఉపాధి హామీ కార్మికులు శీలం కాటయ్య, వెంకటే శ్వరమ్మ, అనిల్, రంగారావు, రత్నకుమారి, శివ పార్వత రావు, లక్ష్మణరావు, ఉమామహేశ్వరరావు, బాపనరావు, శివకోటి తదితరులు పాల్గొన్నారు.



### ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో

## హనుమాన్ నగర్‌లో హెల్త్ క్యాంప్

**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రజల ఆరోగ్యాన్ని ప్రధానంగా భావిస్తూ హనుమాన్ జంక్షన్ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, అనారోగ్య సమస్యలు గుర్తించిన వారికి తక్షణ చికిత్స అందించారు. అలాగే అవసరమైన వారికి ఆరోగ్య సూచనలు ఇస్తూ వారి ఆరోగ్యం కుదుటపడే వరకు పర్యవేక్షణ చేపట్టాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులకు సూచించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లయన్ అట్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ ఆరోగ్య శిబిరం ద్వారా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో లబ్ధి పొందారని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తా మని నిర్వాహకులు పేర్కొన్నారు.

### వైసీపీ నాయకులపై దాడి చేసిన వారిపై

## చర్యలు తీసుకోవాలి



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్లో వైసీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వైఎస్ఆర్సిపి నాయకులు ఇటీవల జరుగుతున్న దాడులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నలకుర్తి రమేష్, మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్ ఎంపీటీసీ వర్రీ నరేష్ పార్టీ నాయకులు చింతలపూడి బాల భాస్కరరావు గాజుల జయ గోపాల్ సామర్ల రాముడు బర్రె రామకృష్ణ అవనిగడ్డ రంగనాథ్ అన్నపురెడ్డి పరమాత్మ, సింహాద్రి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా తిరుపతమ్మ తల్లి జలబిందెల మహోత్సవం





**గన్నవరం, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ తల్లి పెద్ద తిరునాళ్లలో భాగంగా సోమ వారం అమ్మవారి జలబిందెల మహోత్సవాన్ని భక్తులు అ త్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకు న్నారు. భక్తులు జలబిందెలతో ఊరేగింపుగా స్టేషన్ సెంట ర్‌కు చేరుకోగా, పోలీస్ సిబ్బంది వారికి ఘనంగా స్వాగ తం పలికారు. ఆలయ ఆచారం ప్రకారం ఈ జలబిం దెలను పోలీస్ స్టేషన్‌లోకి తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజ లు నిర్వహించారు.

అనంతరం ఆలయానికి చేరుకున్న యార్లగడ్డ దంపతులకు అధికారులు ఆలయ మర్యాదల తో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## విద్యార్థినులకు టైలరింగ్‌లో శిక్షణ

**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన మొవ్వ వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో పీ.ఎం ఉషా, యాక్సిస్ పాయింట్ సాఫ్ట్వేర్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు టైలరింగ్ లో 45 రోజుల శిక్షణ పూర్తి చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్.మాధవి తెలి పారు. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థినిలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి వారికి టైలరింగ్ పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ గా డాక్టర్ టి. శ్రీకాంత్,డాక్టర్ జి.సురేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ కే.ఆర్. మంజుల,ఎం. మణి ప్రసాద్, డాక్టర్ కే.వెంకటే శ్వర్లు, డాక్టర్ ఎన్. కృష్ణమోహన్, అలాగే ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ జి. కరుణ శ్రీ, సిహెచ్ జగదాంబికా, డాక్టర్ ఏ. వి. వి. మల్లేశ్వరమ్మ, సి.హెచ్. రత్న మేరీ, డాక్టర్ వై సునీత, ఎస్. బి. రఫియా పర్యవేక్షణలో యాక్సిస్ పాయింట్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు మేనేజర్స్ ఎస్. జ్యోతి, జె.జయ, ఎస్ నాగలక్ష్మి, జై శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పూర్తి చేయడం జరిగింది.శిక్షణలో పూర్తి చేసుకున్న విద్యార్థినిలకు సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు..

## ఆవును శస్త్ర చికిత్సతో కాపాడిన పశు వైద్యాధికారి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చిట్టు ర్పు మల్లు పెద్ది సాంబశివ రావు అనే రైతు ఆవు అరు దైన గడ్డతో బాధపడుతూ ఉండగా మండల పశువైద్యా ధికారి డా.దేవిన హరీష్‌ని శనివారం సంప్రదించ గా విజయవాడ ఏడిడిఎల్ ల్యాబ్‌కి నమూననను పంపించి పరీక్ష చేయిం చగా, ఆవు చాల ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉందని సోమవారం అత్యవ సర శస్త్ర చికిత్స చేయాలని తెలిపారు. రైతు అంగీకరించారు. సోమవారం 3 గం"ల పాటు శ్రమించి రొమ్ములో 8 లీటర్ల చీమును, గడ్డ కట్టిపోయిన 5 కేజీల చీము గడ్డను శస్త్ర చికిత్స చేసి రొమ్ము నుండి తొలగించారు. 2 నెలలుగా తీవ్రమైన నొప్పితో బాధపడుతున్న, ఆవుని ప్రాణాంతకమైన ఇబ్బం దని తొలగించిలోకు తాము చూడని ఆపరేషన్‌తో ఆవుని కాపాడినందుకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ దేవిన హరీష్‌ను పాడిరైతు, గ్రామస్తులు అభినం దించారు. ఆపరేషన్‌లో చిట్టూర్పు ఏ.హెచ్.ఏ. కిషోర్ ఇతర ఏ.హెచ్.ఏ. లు షబ్బీర్, బాజీ సహాయం చేసారు.

## పచ్చిరొట్ట, సేంద్రియ, జీవన ఎరువులే ఉపయోగించండి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల, మల్లాయి చిటూర్పు లో కే.వీ.కే సమన్వయ కర్త డా.డి.సుధారాణి ఆధ్వర్యంలో పంట లలో యాజమాన్యం పై అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. రసా యన ఎరువులు, పచ్చి రొట్ట, సేంద్రీయ, జీవన ఎరువులు వినియోగించు విధానాన్నీ రైతులకు తెలియజేశారు. సస్యపోక్షణ శాస్త్రవేత్త డా. వెంకట లక్ష్మీ మాట్లాడుతూ పచ్చి రొట్ట, పశువుల పశువుల వేయడంతో నేలలో సేంద్రీయ కార్బనం శాతం పెరుగుతుంది. జీవన ఎరువులు పంటలలో తక్కువ ఖర్చుతో వరి, మినుము, కూరగాయ మొక్కలకు, పంటలకు వినియోగించు కోవచ్చున్నారు. నేలలో సూక్ష్మజీవుల సంఖ్య నేలలో ఉన్న పోషకాలు కరిగి మొక్కలకు పోషకాలు అందించడం, భూమి సారవంతం అవుతుందన్నారు మండల వ్యవసాయ అధికారీ అనూష, యం.పి.టి.సి కుమార్ రాజా, సర్పంచ్ ఆవుల రేవతి, వైస్ ప్రెసిడెంట్ నాగబాబు, నీటి సంఘం అధ్యక్షులు ధర్మ వెంకట నరసయ్య, లంకపల్లి కోపరేట్, బ్యాంకు అధ్యశుడు నాగేశ్వరరావు ఎండకుదురు, పోషడం రైతులు పాల్గొన్నారు.

## నేడు అవనిగడ్డలో ప్రజా దర్బార్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం అవనిగడ్డలో ఏర్పాటు చేసిన ట్లు నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం స్థానిక రెవిన్యూ భవనంలో మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## కొనసాగుతున్న స్వర్గీయ మండలి శత జయంతి

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్నారు. శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీ, మండలి అభిమానులు సంయుక్త నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, టిడిపి మండల ఇపార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టీసీ అధ్యక్షులు రవీంద్ర, చుండూరు నాగేశ్వరరావు, నాగాయలంక మండలం రేమాలవారిపాలెం, పేర్లవానిలంక గ్రామాల నుంచి కూటమి నాయకులు వేకనూరు సోమేశ్వరరావు, పేర్ల గోవింద రామయ్య, పేర్ల భీమేశ్వరరావు, కైతేపల్లి వీరప్రసాద్, పేర్ల శ్రీహరి, కందుల సోమేశ్వరరావు, కైతేపల్లి కోటేశ్వరరావు, వేకనూరు రమ్యసాయి, పేర్ల సురేష్, పేర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ టి. దామోదర నాయుడు పునర్ నియామకం చెల్లదు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** డాక్టర్ టి. దామోదర నాయుడు ని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పునర్నియమించడం అనేది, సక్రమంగా నిర్దేశించిన పునర్నియమన ప్రక్రియను పాటించకుండా, ఆ పదవికి వర్తించే చట్టబద్ధమైన నిబంధనలు, నియమాలను ఉల్లంఘించి జరిగింది. ఈ దృష్ట్యా, అటువంటి పునర్నియమకం సక్రమం కాదని, చట్టబద్ధంగా చెల్లదని 2026 జనవరి 29న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గౌరవ న్యాయమూర్తి విజయ్ జె. తీర్పు ఇవ్వడం జరిగిందని ఏపీ పశుసంవర్ధక గెజిటెడ్ అధికారుల సంఘం (రిజిస్ట్రేషన్ నెం. 201 ఆఫ్ 2025) అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్. ఎస్. కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

## బాయిలర్ అటెండెంట్ మొదటి, రెండవ తరగతి పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ బాయిలర్ల శాఖలో బాయిలర్ అటెండెంట్ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని చైర్ పర్సన్, కమిటీ ఆఫ్ ఎగ్జామినర్స్, బాయిలర్ల సంచాలకులు బి. ఉమామహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మే/జూన్ నెలల్లో నిర్వహించబోయే మొదటి, రెండవ తరగతి పరీక్షల నిర్వహణ కు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుచున్నామన్నారు. అర్హతలు, విద్యార్హత, వయస్సు, పని అనుభవం వంటి పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్: www.ap.gov.in అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించగలరన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పైన పేర్కొన్న వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చున్నారు. పరీక్షలు నిర్వహించే తేదీలు, పరీక్షా కేంద్రాల వివరాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి31వ తేదీ సాయంత్రం 05:00 గంటల లోపుగా సమర్పించాల్సి ఉంటుందని చైర్‌పర్సన్, కమిటీ ఆఫ్ ఎగ్జామినర్స్, బాయిలర్ల సంచాలకులు బి. ఉమామహేశ్వరరావు ఆ ప్రకటనలో తెలియజేశారు.

## వలస కార్మికుల అవగాహనకు ప్రచార రథం ప్రారంభం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు మరియు వలస కార్మికులకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ప్రచార రథాన్ని ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ధనలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిపై ప్రతి కార్మికుడు పూర్తి అవగాహన కలిగి ఉండి తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు, వలస కార్మికులు ప్రభుత్వ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలను పొందేలా ఈ ప్రచార రథం ద్వారా గ్రామ గ్రామాలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఓలు, డిబిఆర్సి స్టేట్ కోఆర్డినేటర్ నరేష్, ఉమ్మడి కృష్ణాజిల్లా కోఆర్డినేటర్ ఈశ్వర్,ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, ప్రతినిధులు సమన్వయంతో పనిచేశారు.

# బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషిచేద్దాం..




### పిల్లల బంగారు భవిష్యత్తుకు చేయీచేయీ కలుపుదాం

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, ఫిబ్రవరి 2, మేజర్ న్యూస్ :** బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయీచేయీ కలపాలని, పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వాసవ్య మహిళా మండలి (వీఎంఎం) – బాల్య వివాహ విముక్తి రథాన్ని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంతకం చేసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వాసవ్య మహిళా మండలి ఓ మంచి కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. వసుధైవ కుటుంబంలో భాగమైన మనందరం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరక్కుండా కలిసిక ట్టుగా కృషిచేయాల్సి ఉందన్నారు.

చట్టాలను గౌరవిస్తూ, నిబంధనలు పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతి రేకంగా గళమెత్తాల్సిన అవసరముందన్నారు. ఈ ప్రచార రథం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాల్య వివాహాల దుష్పరిణామాలు, చట్టాలుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ (1098), ఉమెన్ హెల్ప్‌లైన్ (181) కూడా అందుబాటులో ఉన్నాయని.. ఎవరైనా ఈ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించవ చ్చున్నారు. ఈ ప్రచార రథం ద్వారా బాల్య వివాహాలపై అవగాహన కల్పించ డంతో పాటు లక్ష మందికి పైగా ప్రజల నుంచి సంతకాలు సేకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ వాసవ్య మహిళా మండలి బృందానికి సూచించారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ రామానుజయ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, డీసీపీయూ ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులకు బడ్జెట్‌లో పెద్దపీట

### సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ హర్షం





విజయవాడ, ఫిబ్రవరి 1, మేజర్ న్యూస్ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ‘వికసిత్ భారత్ 2047’, ‘ఆత్మనిర్భరత‘ విజన్ స్ఫూర్తితో ప్రజల ఆకాంక్షలు, సమగ్ర వృద్ధిని సమతుల్యం చేస్తూ 2026-27 కేంద్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడాన్ని సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. గడిచిన 12 ఏళ్లుగా భారతదేశం అనుసరిస్తున్న క్రమశిక్షణతో కూడిన ఆర్థిక విధానాలు, స్థిరమైన వృద్ధి, నియంత్రణలో ఉన్న ద్రవ్యోల్బణం దేశ ఆర్థిక పథాన్ని పటిష్టం చేశాయని ఈ బడ్జెట్ నొక్కి చెప్పింది. ఇది సిమెంట్ వంటి మౌలిక సదుపాయాల అనుబంధ రంగాలకు బలమైన డిమాండ్‌ను కల్పిస్తోంది. ఈ సందర్భంగా సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్థ్ జిందాల్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ఇచ్చే ప్రాధాన్యతలో భాగంగా ప్రభుత్వ మూలధన వ్యయాన్ని గత ఆర్థిక ఏడాది (2025-26) లో ఉన్న రూ.11.2 లక్షల కోట్ల నుంచి రూ.12.2 లక్షల కోట్లకు పెంచారన్నారు. నగరాల అభివృద్ధికి ఐదు లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన టైర్ 2, టైర్ 3 నగరాలపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఒక్కో నగర ఆర్థిక ప్రాంతానికి ఐదేళ్ల కాలానికి రూ.5,000 కోట్ల కేటాయింపులు జరిగాయన్నారు. ఈ నిర్ణయాల వల్ల గృహనిర్మాణం, రవాణా, పట్టణ సేవల రంగాలలో నిర్మాణ కార్యకలాపాలు వేగవంతం అవుతాయన్నారు. ఇది దేశవ్యాప్తంగా సిమెంట్ వినియోగాన్ని పెంచడమే కాకుండా, సిమెంట్ పరిశ్రమకు దీర్ఘకాలిక భరోసానిస్తుందని తెలిపారు. బడ్జెట్‌లో ప్రకటించిన లాజిస్టిక్స్, కనెక్టివిటీ చర్యలు సిమెంట్ పరిశ్రమకు అత్యంత కీలకమన్నారు. ఈ క్రింది నిర్ణయాలు రవాణా సామర్థ్యాన్ని పెంచడంలో, ఖర్చులను తగ్గించడంలో సహాయపడతాయని తెలిపారు. సరుకు రవాణా కోసం ప్రత్యేక రైల్వే కారిడార్ల ఏర్పాటు, రాబోయే ఐదేళ్లలో 20 అదనపు జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురావడం, జలమార్గాలు, తీరప్రాంత షిప్పింగ్ వాటాను ప్రస్తుతం ఉన్న ఆరు శాతం నుంచి 2047 నాటికి 12 శాతానికి పెంచడానికి ప్రత్యేక పథకం, ఓడల మరమ్మత్తు వ్యవస్థల అభివృద్ధి ద్వారా మల్టీమోడల్ రవాణా సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇది సిమెంట్ రంగం కాలుష్యం తగ్గించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఏడు హై-స్పీడ్ రైల్ కారిడార్లను ‘గ్రోత్ కారిడార్ల‘గా ప్రకటించడం వల్ల ప్రాంతీయ అభివృద్ధి, నిర్మాణ రంగంలో డిమాండ్ పెరుగుతుందన్నారు. భారతదేశం ‘వికసిత్ భారత్‘ దిశగా పయనిస్తున్న తరుణంలో ఈ బడ్జెట్‌లో పేర్కొన్న మూడు ‘కర్తవ్యాలు‘ దేశ ఆర్థిక వృద్ధికి, సామర్థ్య పెంపునకు, సమగ్ర పురోగతికి స్పష్టమైన మార్గాన్ని చూపాయన్నారు. తయారీ రంగం పోటీతత్వం, పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధునీకరణపై ఈ బడ్జెట్ చూపుతున్న శ్రద్ధను అభినందించారు. 350 పైగా సంస్కరణలు ఉన్నాయని తెలిపారు. జీఎస్టీ సరళీకరణ, లేబర్ కోడ్‌లు, క్వాలిటీ కంట్రోల్ హేతుబద్ధీకరణ, రాష్ట్రాలతో సమన్వయం చేస్తూ తీసుకువచ్చిన డీరెగ్యులేషన్ సంస్కరణలు పరిశ్రమకు ఎంతో మేలు చేస్తాయన్నారు. యువశక్తికి ప్రాధాన్యత ఇవ్వడం ‘ఆత్మనిర్భరత‘ కింద దేశీయ తయారీ సామర్థ్యాన్ని పెంచడం వల్ల సిమెంట్ వంటి భారీ మూలధన పెట్టుబడితో కూడిన రంగాలకు పెట్టుబడి వాతావరణం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాఘవ్‌పత్ సింఘానియా మాట్లాడుతూ సిమెంట్ వంటి ఉద్గారాలు ఎక్కువగా వెలువడే పరిశ్రమల కోసం బడ్జెట్‌లో రూ.20,000 కోట్ల వ్యయాన్ని కేటాయించారన్నారు. ఇది భారత పారిశ్రామిక రంగంలో డీకార్బనైజేషన్ (కర్బన ఉద్గారాల తగ్గింపు) దిశగా ఒక విప్లవాత్మక మార్పు అన్నారు. సిమెంట్ రంగం భారీ స్థాయిలో ఉద్గారాలను తగ్గించడానికి ఇది ఒక శక్తివంతమైన సాధనమన్నారు. ఈ నిధులు సాంకేతిక, వ్యయపరమైన సవాళ్లను అధిగమించడానికి తోడ్పడతాయన్నారు. 2070 నాటికి ‘నెట్ జీరో‘ చేరుకోవాలన్న భారత ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, దేశ మౌలిక అవసరాలను తీరుస్తూనే పర్యావరణాన్ని రక్షించడానికి సిమెంట్ పరిశ్రమ కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై చూపుతున్న నిరంతర ఆసక్తి ఉపాధి కల్పనకు, ప్రాంతీయ అభివృద్ధికి, సప్లయ్ చైన్ బలోపేతానికి ఎంతో కీలకమన్నారు. సిమెంట్ తయారీ కేంద్రాలు ఆయా ప్రాంతాలలో ఆర్థిక చోదక శక్తులుగా ఉంటూ నిర్మాణం, లాజిస్టిక్స్ వంటి అనుబంధ రంగాలలో జీవనోపాధిని మెరుగుపరుస్తున్నాయని తెలిపారు. టైర్ 2, టైర్ 3 నగరాలపై దృష్టి, సిటీ ఎకనామిక్ రీజియన్ల ఏర్పాటు సిమెంట్ రంగానికి కొత్త ఊపిరి పోస్తాయమ్నారు. పర్యాటక సౌకర్యాలు, వారసత్వ సంపద, బౌద్ధ సర్క్యూట్లు, ‘పూర్వోదయ‘ పథకం కింద ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయించిన నిధులు నిర్మాణ రంగ కార్యకలాపాలను విస్తరింపజేస్తాయని తెలిపారు. జిల్లా ఆసుపత్రులలో ఎమర్జెన్సీ, ట్రామా కేర్ మౌలిక సదుపాయాల బలోపేతం వంటి నిర్ణయాలు సిమెంట్ రంగం సామాజిక పాత్రను నొక్కి చెబుతున్నాయన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ద్రవ్య లోటును జీడీపీలో 4.3 శాతం వద్ద అంచనా వేస్తూ ప్రభుత్వం పాటిస్తున్న ఆర్థిక క్రమశిక్షణను సానుకూలంగా చూస్తున్నామన్నారు.

# ఉయ్యూరులో అత్యంత వైభవంగా వీరమ్మ తల్లి తిరునాళ్ళు



## ఉయ్యూరు వీరమ్మ తల్లి చరిత్ర

## పుట్టి నింటి నుంచి మెట్టి నింటికి తిరునాళ్ళు

వీరమ్మ తల్లికి అయిదు వందల సంవత్సరాల చరిత్ర వుంది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు దగ్గర పెదక డియం అనే గ్రామంలో యాదవ కులానికి చెందిన "బొడ్డు"వారి ఆడపడుచుగా ఆమె జన్మించింది.తండ్రి పరశు రామయ్య, తల్లి పార్వతమ్మ.పరమేశ్వర వర ప్రసాదంగా జన్మించిలోన "వీర శివమ్మ "అని పేరు పెట్టారు. చిన్న తనం నుంచి భక్తి శ్రద్ధలతో, దైవ చింతనతో పెరిగింది. ఉయ్యూరు గ్రామానికి చెందిన యాదవ దంపతులు పారుపూడి చలమయ్య,చెల్లమ్మల పెద్ద కుమారుడు చింతయ్యతో ఆమె ఎనిమిదవ ఏట జ్యేష్ఠ శుద్ధదశమినాడు, పెదకడియంలో ఆమెకు వివాహం చేశారు. కొన్ని రోజులు పుట్టింట్లో నే వుంది యుక్త వయసు రాగానే ఉయ్యూరులోని మెట్టి నింటికి సంసార జీవన మాధుర్యాన్ని అనుభవించటానికి పుట్టినింటి వారు పంపారు అత్త వారింట్లో అందరి అభిమానాన్ని, ఆదరాన్నిపొందింది వీరమ్మ.తన సేవా తత్పరతతో అత్త మేనత్తను, మామయ్యను మెప్పించింది. మరది భోగయ్యను బిడ్డ లాగ చూసింది. చుట్టు పక్కల వారికే కాక బంధు గణానికీ అంతటికీ ఆమె "ఉత్తమ ఇల్లాలు"అయింది.భర్త సేవలో జీవితం ధన్యం చేసుకోంది. జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది. ఇంతలో కుటుంబంలో ఒక అలజడిరేగింది. మరది భోగయ్యకు అచ్చమ్మతో వివాహమైంది. ఆమె గర్విష్టి, విద్యా హీన ఆమెకు వీరమ్మ మీద అసూయాపెరిగింది.ఊరందరూ తోడి కోడలు వీరమ్మను మెచ్చు కోవటం ఆమె కు బాధ కలిగి అలిగి పుట్టింటికి చేరింది. అయితే సాధ్వీమణి వీరమ్మ, అత్త మామలకు,మరిదికి నచ్చ చెప్పి, తోడి కోడల్ని, మళ్ళీ అత్త వారిల్లు చేరేల్లు చేసింది. ఆమె మనసులోని అసూయా తొలగి పోయి, తోడికోడళ్ళు అన్యోన్యంగా వుంటూ,వూరి వారికి ఆదర్శ మైనారు.

### భర్త మరణం -సహగమనం

ఉయ్యూరు గ్రామంలో కరణం సుబ్బయ్య కు స్త్రీ వ్యామోహం ఎక్కువ. అతని కళ్ళు సాధ్వీ మణి వీరమ్మ పై పడ్డాయి. లోబరుచు కోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. దగ్గరలో వున్న "గురజాడ "గ్రామం లోని తన బావ మరిది "సీతయ్య" ను తనకు సాయం చేయమని బ్రతిమాలాడు.అతడు రావణాసురుడికి మారీచుడు చేసినట్లు హిత బోధ చేశాడు.చెవి కెక్క లేదు ఎంతైనా బావ కదా తన సోదరి కాపురం ఏమవుతుందో నే భయం సీతయ్య కుపట్టుకొంది. మంత్ర తంత్రాలు తెలిసిన సీతయ్య మెత్తబడి చివరికి సాయం చేయటానికి ఒప్పు కున్నాడు. మేకల, గొర్రెల మేత కోసం చింతయ్య,భోగయ్య సోదరులు వాటిని తోలుకోని ఉత్తరాదికి అంటే బెజవాడ అవతలి ప్రాంతాలకు వెళ్ళారు.ఇదే అదునైన సమయం అని బావ మరిది సీతయ్యను ప్రేరేపించాడు బావ సుబ్బయ్య సీతయ్య ప్లాన్ వేశాడు. తన నౌకరుకు విషం పూసిన సార ముల్లు ఇచ్చి, చింతయ్యపై రహస్యంగా ప్రయో గించమని చెప్పి పంపాడు. ముస్తాబాద్‌లో గొర్రెల మందల దగ్గర నిద్ర పోతున్న చింతయ్యను ఆ నౌకరు విషం వున్న ఆ సార ముల్లు తో పొడిచి హత్య చేశాడు చింతయ్య బాధ భరించలేక చని పోయాడు.

తమ్ముడు భోగయ్య అన్న శవాన్ని ఉయ్యూరు తీసుకొని వస్తాడు ఈ వార్త విని వీరమ్మ తల్లడిల్లిపోతుంది. తాను గాడంగా ప్రేమించిన భర్తతో సహగమనం చేయాలని నిశ్చయించుకుని.తన భర్త హత్యకు కారణం సుబ్బయ్య అని తెలుసుకొని అతని వంశం నిర్వంశం కావాలని శపించింది.సుబ్బయ్య అకస్మాత్తుగా చని పోయాడు అతనితో అతని వంశము అంతరించింది. వీరమ్మ పుట్టినింటి వారు ఈమెను మళ్ళీ పెళ్లి చేసుకోమని బలవంతంపెట్టారు.ఆమెకు కోపం వచ్చి పుట్టి నింటి వారిని కూడా "నిర్వంశం "కావాలని శాపంపెట్టింది.

సతీ సహగమనానికి ఉయ్యూరు జమీందారు, గోల్కొండ నవాబు ప్రతినిధి "జిన్నా సాహెబ్" అంగీ కరించారు. వీరమ్మ మహిమలు వెంట వెంటనే బయట పడుతూ, ఆమె అంటే అందరిలో భక్తి ఏర్పడింది. చింతయ్యకు చితి ఏర్పాటు చేయించారు. వీరమ్మ కు అగ్ని గుండం ఏర్పాటు అయింది. గుండం తవ్వ టానికి ఉప్పర కులస్తులు ఒప్పుకోక పోతే మాదిగవారు వచ్చి తవ్వారని అందుకే సిడి బండి నాడు ఆ కులానికి ప్రాధాన్యత ఏర్పడింది. ముత్తైదువులు పసుపు దంచుతుంటే, రోలు పగిలింది. వీరమ్మ తల్లి మోకాలు అడ్డ పెట్టి,తానూ రోకటిపోటువేసింది. ముత్తైదువులకు పసుపు,కుంకుమలు పంచిపెట్టింది. ఆమె దంచిన రోలు ఇప్పటికీ ఆలయం దగ్గర కన్పిస్తుంది.

చింతయ్య చితికి తమ్ముడు భోగయ్య నిప్పు అంటించాడు. వేలాది ప్రజలు భోరున విల పిస్తుండగా, అత్తా మామలు,బంధు గణంశోక సముద్రంలో మునిగి ఉండగా పుణ్య స్త్రీలతో, తోటికోడలితో,"పారెళ్ళు "పెట్టించుకొని,పెళ్లి కూతురు లా,పుష్పాలతో శిరోజాలను అలంకరించు కోని సాధ్వీమ తల్లి,పతివ్రతా శిరోమణి, వీరమ్మ తల్లి, భర్త చితికి మూడు సార్లు ప్రదక్షిణం చేసి,భగ భగ మండే ఆ మంటలో తానూ,భర్త చితి పై చేరి అగ్ని గుండంలో సహ గమనం చేసింది.మహిమ గల తల్లిగాఆనాటి నుంచిఈ నాటి వరకు ప్రజల నీరాజనాలు అందుకొంటోంది.

రాజ ప్రతినిధి "జిన్నా సాహెబ్" వీరమ్మకు నమస్కారం చేసి,ఇంటికి వెళ్లి నిద్ర పోయాడు.ఆ రాత్రి నిద్ర లో వీరమ్మ భర్త చింతయ్య తో సహ మహాతేజోవంతం గా,సర్వాలంకార శోభతో కన్పించింది.స్త్రీలు పూజలు చేస్తున్నట్లు,వీరమ్మ వారికోర్కెలు తీరుస్తున్నట్లు, గండదీపాల కాంతిలో అమ్మ తల్లి,ఒక దుష్ట శక్తిని కాలితో తన్నుతూ ఉయ్యాల ఊగు తున్నట్లు గుడి పక్కనే పెద్ద తటాకం వున్నట్లు,అందులో వికసించిన తామర పూలున్నట్లు సాహెబ్‌కి కలలోకన్పించిందట. ఉదయం లేచి జమీందారును పిలిపించారు.జమీందార్ కు కూడా అలాంటి స్వప్నమే వచ్చినట్లు చెప్పారట చింతయ్య మరణానికి కారకు లెవరో తెలుసు కోవ టానికి వేగుల్ని పంపారు. సుబ్బయ్యే కారణం అని అమ్మ వారి సహ గమనం రోజే తీవ్ర మైన బాధ తో అతడు మరణిం చాడని తెలుసుకున్నారు సుబ్బయ్య వంశం సర్వ నాశనమై చివరికి వారసులెవరు లేకుండా నిర్వంశం అయింది.

### ఆలయ నిర్మాణం తిరునాళ్ళ ఏర్పాట్లు

అందరూ ఆలోచించి, వీరమ్మ అత్త మామలతో సంప్రదించి, గ్రామస్తులతో సమా వేశం జరిపి, సహగమనం జరిగిన చోటులో ఆలయాన్ని నిర్మించారు. చెరువు తవ్వించారు. వీరమ్మ చింతయ్యల విగ్రహాలను ఉయ్యాల స్తంభాలను తయారు చేయించారు. జిన్నా, జమీందారు సమక్షంలో భక్త జన సందోహం మధ్య వైభవం గా ప్రతిష్ట జరిగింది.ఆలయం ఉయ్యాల స్తంభాల ఖర్చును జిన్నా గారే పెట్టు కొన్నారు.చెరువును తవ్వించిన ఖర్చు,ప్రతి ఏటా మాఘ శుద్ధ ఏకాదశి నుండి పదిహేను రోజులు పాటు జరిగే ఉత్సవ ఖర్చు జమీందారు భరించారు. ఆనాటి నుంచి ముందుగా మెట్టినింటి వారు తర్వాత జిన్నాగారు తర్వాత గ్రామస్తులు అమ్మ వారి ఉత్స వాలను ప్రారంభించి కొన సాగించారు.పారుపూడి వంశంవారినీ, జమీందారుని,ప్రభుత్వాధి కారులని ధర్మ కర్తలు గా జిన్నా నియమించారు.అంటే వీరమ్మ తల్లి తిరుణాలను ప్రభుత్వ పరంగా నిర్వహించే ఏర్పాటు చేశారన్న మాట.

అందుకే నేటికీ పోలీసు వారిచ్చే పసుపు కుంకుమ చీరె సారేలతో సంబరాలు ప్రారంభ మవటం ఆన వాయితీగా వస్తోంది. అమ్మ వారు ఉయ్యాల ఊగే ప్రదేశంలో ఏ కట్టడమూ వుండదు.తన భర్తనూ హత్య చేయించిన కిరాతకుడు సుబ్బయ్య ను కాలితో తన్ని,చిరునవ్వు చిన్దిస్తున్నట్లు ఉయ్యాల ఊగటంలో అంతరార్థం.ఆమెసహగమనం చేసిన రెండు మూడు రోజులకే మాఘ శుద్ధ ఏకాదశి రావటం అదే భీష్మ ఏకాదశి కావటం ఆ రోజూ నుంచే ఉత్స వాలు ప్రారంభించటం జరుగుతోంది. చరిత్ర కాల గర్భం లో కలిసిన వీరమ్మ తల్లి మహిమలు నిత్య నూతనం.నమ్మిన వారికి నమ్మి నంత శుభం చేకూర్చే తల్లి వీరమ్మ.తిరునాళ్ళు పదిహేను రోజుల్లో ను,ఉయ్యూరులో ఏ ఇంట్లోను పసుపు దంచరు కుంకుమ తయారు చేయరు ముందే సిద్ధంచేసు కొంటారు కారంకూడా కొట్టరు.ఇవి స్వచ్ఛందంగా అందరు పాటించే నియమాలే.తిరునాళ్ళలో అమ్మ వారికి సాధారణంగా అందరు చీరపసుపు కుంకుమ పెట్టటం అలావాటు.అంతే కాక ఆ తర్వాత ఎవరింట్లో నైనా వివాహం లాంటి శుభ సందర్భాలు వచ్చి నప్పుడు కూడా చీరసారే పెడుతుంటారు మెట్టి నింట్లో వున్న అమ్మ వారికి...

అమ్మ వారి చీరలు అని ప్రత్యేకంగా అందరికి అందుబాటైన ధరలో ప్రతి వస్త్ర దుకాణంలోను లభిస్తాయి ఆమె పవిత్రతను ఇలాతర తరాలుగాపాటిస్తూ, నేటికీనిల బెట్టుకొంటున్నారు ఉయ్యూరు, పరిసర గ్రామాల వారు అమ్మ వారి ఊరేగింపులో జనరేటర్ తో అమర్చే విద్యుత్ బల్బుల శోభతోకట్టుకొంటుంది.యాదవ కులస్తులు తిరునాళ్ళ రోజుల్లో వివాహాలు చేయరు.పెళ్లి అయిన వాళ్ళు కూడా,అపవిత్ర దినాలలో బ్రహ్మ చర్యం పాటించి,వంశ ప్రతిష్టను నిల బెట్టు కొంటారు బంధువులను పిలుచుకొని విందు భోజ నాలు ఏర్పాటు చేసు కొంటారు. అంతా పెళ్లి శోభలాగా వుంటుంది ఇప్పటికీ పారుపూడి వంశాస్తులే ఆలయ పూజార్లు. ఆలయాని పంట పొలాలున్నాయి



సనాతన ధర్మ పరిరక్షణ
ఆధ్యాత్మిక సేవకులు
గద్దం రాజు
(సమాచారం సేకరించిన వారు)

# భావవ్యక్తీకరణ స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న మాజీమంత్రులు

(మొదటిపేజీ తరువాయి)

నువ్వు దుర్గగుడికి రా.. లేదా నేను మీ ఇంటికి వస్తాను, నువ్వు మా ఇంటికి రా..అంటూ సవాళ్లు విసురుతున్నాడు. జోగి రమేష్ ఒక అసాంఘిక వ్యక్తి. ఇతని భాష ప్రజాస్వామ్య మనుగడకే ప్రశ్నార్ధకం.జోగి రమేష్ భాష వల్లనే ఇటువంటి పరిస్థితి తెచ్చుకున్నాడు.అనవసరంగా లేని పోని వివాదాలు తెచ్చుకుని, అతి తెలివి ప్రదర్శిస్తున్నాడు.జోగి రమేష్ ఇంటిపైకి వెళ్ళాలనే ఉద్దేశ్యం ఎవరికీ లేదు. అతను మాట్లాడిన భాష కారణంగానే కార్యకర్తలు అసహనానికి గురై కొందరు దాడికి ప్రయత్నించారు. ఇదే సందర్భంలో పోలీసులు, కూటమి నాయకులు చాలావరకు జరగాల్సిన పెద్ద నష్టాన్ని నివారించారు.వ్యక్తిగత దూషణ చేయటం, బూతులు తిట్టడాన్ని వైసీపీ అధినాయకత్వం ప్రోత్సహిస్తుంది. కానీ కూటమి ప్రభుత్వం తప్పు చేస్తే వారు ఎవరైనా సహించదు. ఇబ్రహీంపట్నం ఘటనపై హోంమంత్రి, ప్రభుత్వ పెద్దలు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.వైసీపీ బూతులు తిట్టడాన్ని ప్రోత్సహిస్తోంది కాబట్టే వైకాపా నాయకులు బరి తెగించి మాట్లాడుతున్నారు. ప్రతిపక్షంగా సద్విమర్శలు చేస్తే హుందాగా స్వీకరిస్తాం. కానీ దుర్భాషలు ఆడటం, దిగజారి మాట్లాడటం వద్దు. దయచేసి ఇది మంచి పద్ధతి కాదు.జోగి రమేష్ బడుగు బలహీన వర్గాల ప్రతినిధి అని చెప్పుకుంటూ బాగా రెచ్చిపోయి మాట్లాడుతున్నాడు. తెగిడిసినోడు వీధికి పెద్ద అయితే, బరి తెగించినవాడు ఊరికి పెద్ద అయితే, ఇడిసేసినోడు జిల్లాకు పెద్ద అన్న చందంగా జోగి పరిస్థితి మారింది. కృష్ణాజిల్లాలో ఎందరో మహానుభావులు పని చేశారు.83 రోజులు జోగి జైలులో ఉంటే మైలవరం నియోజకవర్గం ఎంతో ప్రశాంతంగా ఉంది. మేము ఎన్నో కార్యక్రమాలు చేసినా అంతా సవ్యంగానే నడిచింది. ఎక్కడా అనవసరంగా విమర్శలు చేయలేదు.ఏపీలో 175 నియోజకవర్గాల్లో మాదిరిగానే మైలవరం నియోజకవర్గంలో కూడా ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. కానీ ప్రతి దాంట్లో కూడా జోగి రమేష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడానికి ఇష్టారీతిన ప్రవర్తిస్తే ఇక్కడ ఎవరు చూస్తూ ఊరుకోరు.జోగి తరహాలో దిగజారి మేము మాట్లాడలేక పోతున్నాం. ఇది ఒక్కటే మా బలహీనత. మా ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ రకమైన భాషకు అంగీకరించడం లేదు. సీఎం చంద్రబాబు మాకు సంస్కార వంతమైన రాజకీయాలు నేర్పారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణతో కూడిన పార్టీ.జోగి రమేష్ ఇకపై ఏ రోజున చంద్రబాబు గురించి అమర్యాదగా మాట్లాడితే అదే రోజున మేము కూడా జగన్మోహన్ రెడ్డి గురించి కూడా అలాగే స్పందిస్తాం.జోగి రమేష్ సమాజంలో భిన్నమైన అదుపుతప్పిన పదవీకాంక్షతో కూడిన వ్యక్తి. జోగికి ఏ ఆపద వచ్చినా అతని నోటి దూల వల్లే. ఒకవేళ ఇతనికి గౌరవ మర్యాదలు లభించినా అతని నోటి వల్లే.జోగి రమేష్ కు ఉన్న కీర్తిని గురించి ప్రజలను ప్రశ్నిస్తే అతను తలదించుకోవాల్సి వస్తుంది. ఆరేయ్, ఒరేయ్, ఏరా అంటూ ఎన్ని సార్లు జోగి అమర్యాదగా మాట్లాడాడో ప్రజలందరూ చూశారు. జోగి భాష వల్ల ప్రజలు సహనం కోల్పోయి ఉగ్రరూపం దాల్చి ఇది ఎంతటి తిరుగుబాటుకు దారి తీసిందో స్వయంగా చూశారు.గౌరవం ఇచ్చి పుచ్చుకోవాలి. నీకు గౌరవం ఇస్తాం. నువ్వు కూడా అలాగే హుందాగా ప్రవర్తించాలి. ఇద్దరం సమన్వయంతో మైలవరం అభివృద్ధికి పనిచేద్దాం. కానీ భాష మార్చుకుని, దిగజారి మాట్లాడవద్దని జోగికి హితవుపలికారు.

# పరిశ్రమలు నెలకొల్పుటకు అన్ని సౌకర్యాలు కల్పించాలి





(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చినప్పటికీ సంస్థాగతంగా కొన్ని ఇబ్బందులు, సమస్యలు ఉండటంతో వాటిని సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఇతర ప్రభుత్వ అధికారులతో సహకారం అందిస్తున్నప్పటికీ, మూడు పర్యాయాలు సమావేశాలు నిర్వహించినప్పటికీ సరైన శ్రద్ధ చూపటం లేదని, సరైన పురోగతి రాకపోవడం ఏమిటని జిల్లా కలెక్టర్ పరిశ్రమల అధికారులను, ఏపీఐఐసీ అధికారులను ప్రశ్నించారు. బిల్డింగ్ ప్రణాళిక ఆమోదంలో గాని సరిహద్దుల ఏర్పాటు చేయడంలో గాని మౌలిక సదుపాయాలు కల్పించడంలో గాని సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించాక కూడా యూనిట్లు ప్రారంభించక పోతే వారికి తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా యూనిట్లు నెలకొల్పుటకు విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉంటే వాటిని వేరే చోటికి మార్చాలని ఆదేశించారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో పునాదిరాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందనే విషయం ప్రతి ఒక్క పారిశ్రామికవేత్తకు వెంటనే తెలియజేయాల న్నారు. మరల 15 రోజులకు సమావేశం నిర్వహిస్తానని ఆలోగా మంచి పురోగతి సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం వెంకట్రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి, ప్రత్యేక అధికారులు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, డీఎఫ్ఓ సునీత, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, డి టి డబ్ల్యు ఫణి ధూర్జటి, మార్క్ఫెడ్ డి ఎం మురళీ కిషోర్, డి సి ఓ చంద్రశేఖర్,హౌసింగ్ ఈఈ వెంకటరావు, చేనేత జౌళి శాఖ ఏడి సాయి ప్రసాద్, నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్, డి ఎల్ పి ఓ సుజాత శర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

# టీటీడీ లడ్డు అంశాన్ని రాజకీయంగా వాడుకోవడం మహా పాపం

### వైసీపీ నేతల సైకో రాజకీయాలకు హద్దులు దాటాయి....

### బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కె. బుచ్చి రాంప్రసాద్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం మచిలీపట్నం సిడింబి అగ్రహారంలోని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.వి. ఫణి కుమార్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమా వేశంలో వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ముందుగా టీటీడీ లడ్డు అంశంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది భక్తుల హృదయాల్లో కొలువై ఉన్న కలియుగ శ్రీ వేంకటేశ్వర స్వామివారి మహా ప్రసాదమైన లడ్డూను కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం వైసీపీ నేతల దిగజారుడు మనస్తత్వానికి పరాకాష్ఠ అని అన్నారు. భక్తుల విశ్వాసంతో ఆడుకోవడం రాజకీయాలు కాదని, అది మహా పాపమని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు మహా ప్రసాదం పవిత్రతపై ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా, చివరకు నిజమే గెలుస్తుందని, స్వామివారి ముందు ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. లడ్డు అంశాన్ని వక్రీకరిస్తూ భయాందోళనలు సృష్టించడం ద్వారా రాష్ట్రంలో అశాంతి రేపాలనే వైసీపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టిటిడీ లడ్డు వంటి అత్యంత సున్నితమైన అం శాన్ని కూడా వదలకుండా రాజకీయం చేయడం చూస్తే వైసీపీకి భక్తి లేదు, నమ్మకం లేదు, విలువలు లేవని స్పష్టమవుతోందన్నారు. ఈ క్రమంలోనే వైసీపీ నేతల దిగజారుడు భాషపై కూడా ఆయన మండిపడ్డారు. మొన్న అంబటి రాంబాబు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, ఆ వెంటనే జోగి రమేష్ మంత్రి నారా లోకేష్పై చేసిన వ్యాఖ్యలు ఇవన్నీ వైసీపీ రాజకీయ దివాళాకితనానికి నిదర్శనాలని అన్నారు. జోగి రమేష్ నోరు అదుపులో పెట్టుకో. రాజకీయాలు అంటే బూతులు కాదు. భక్తుల విశ్వాసం, ప్రజాస్వామ్యం రెండింటినీ గౌరవించడం నేర్చుకో అని ఆయన హెచ్చరించారు. ఇక పేర్ని నాని విషయానికి వస్తే స్వాతంత్ర సమరయోధు లకు గౌరవం లేని వ్యక్తి దేశభక్తి గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు. మచిలీపట్నంలో ప్రజల ఆకాంక్ష మేరకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభ నేని బాలశౌరిలు స్వాతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరిట స్మారక భవనం నిర్మించి యువతకు శిక్షణలు ఇవ్వాలంటే అడ్డుపడడం చూస్తే పేర్ని నానికి యువత భవిష్యత్తుపట్లా,స్వాతంత్ర సమరయోధుల పట్లా గౌరవం లేదని స్పష్టమవుతోందన్నారు. చంద్రబాబు నాయుడిపై ఎలాంటి సంబంధం లేని కేసుల్లో అక్రమంగా ఇరికించి అరెస్టు చేసిన వైసీపీ పాలన చివరకు న్యాయస్థానాల్లో బట్టబయలైందని గుర్తు చేశారు. నిప్పుకు చద పట్టదు నీతికి కాలం చెల్లదు అన్న నానుడి స్కిల్ డెవలప్మెంట్ కేసులో నిజమైందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా నిరంతరంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇకనైనా అంబటి రాంబాబు, జోగి రమేష్, పేర్ని నాని లాంటి వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే ప్రజలు మాటలతో కాదు చరిత్రలో తగిన స్థానం చూపిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పి.వి. ఫణి కుమార్, చివుకుల దుర్గాప్రసాద శాస్త్రి, వాడపల్లి బాలాజీ సువర్ణకుమార్, సర్వ లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ రామకృష్ణను సస్పెండ్ చేయాలి



**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** మున్సిపల్ మహిళ పారిశుద్ధ కార్మికులు కించపరిచే విధంగా ఫోన్లో వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ రామకృష్ణ ను తక్షణమే సస్పెండ్ చేయాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కమిటీ కార్యదర్శి యం మహేష్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద వర్కర్స్ తో కలిసి ఆందోళన నిర్వహించారు గా విధులు నిర్వహించిన రామకృష్ణ తన స్వలాభం కోసం మహిళా కార్మికుల్ని కించపరిచే విధంగా మాట్లాడుతున్న మాట ఫోన్లో రికార్డ్ చేసిన సామాజిక కార్యకర్త ప్రసన్న బోసు ఆ రికార్డులను గ్రూపుల్లో పంపి వారి వ్యక్తిగత స్వేచ్ఛను భంగం కలిగించిన వీరిద్దరిపై కూడా పోలీసు వారు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుద్ధిలేని రెవెన్యూ ఆఫీసర్ మాట్లాడుతున్న మాటలను సామాజిక కార్యకర్తగా మేధావిగా మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటే ఖండించకుండా మళ్లీ ఆ రికార్డులను గ్రూపుల్లో పెట్టి మహిళల పట్ల చులకన భావంతో వ్యవహరించిన వారు బహిరంగ క్షమాపణ తెలియజేయని పక్షంలో కేసు నమోదు చేయాలని వాస్తవాలు తెలుసుకోకుండా ఫోన్ రికార్డ్స్ ను వాట్సప్ గ్రూపులో పత్రికల్లో వార్తలు రాయించడం అత్యుత్సాహం తప్ప మరొకటి కాదన్నారు... ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎ విఠల్ రావు, కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ జి సురేష్ కార్యదర్శి టి కృష్ణ కోశాధికారి బి నవీన్ ఉపాధ్యక్షులు దేవుళ్ళు అప్పారావు, మున్సిపల్ మేస్త్రి మధు, కార్మికులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిని నిర్మూలిద్దాం...

### వైద్య ఆరోగ్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూలిద్దామని ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన కలిగించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కుష్టు వ్యాధి ని నిర్మూలించడానికి సోమవారం స్పర్శ అవగాహనా కరపత్రములను పోస్టర్స్ ను స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. స్పర్శ అవగాహనా కార్యక్రమము జిల్లా లో ముమ్మరంగా నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతములలో ప్రజల్లో కుష్టు వ్యాధి పట్ల అవగాహన, పూర్తి చైతన్యం తీసుకురావడం, శుభ్రత, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై విస్తృత ప్రచారం కలిగించడం ద్వారా కుష్టు వ్యాధి నిర్మూలించవచ్చున్నారు. ఈ వ్యాధి నిర్మూలనకు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, ప్రతి ఒక్కరూ పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉండాలని, వ్యాధి వచ్చిన వారు ప్రారంభ దశలోనే సకాలంలో మందులు తీసుకోవాలని డి. కె. బాలాజీ సూచించారు. వ్యాధి వచ్చిన వారిని చిన్న చూపు చూడకూడదన్నారు. సకాలంలో మందులు తీసుకుంటే వ్యాధి నిర్మూలన సులభతరం అవుతుందన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సమిష్టి భాగస్వామ్యంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి కుష్టు వ్యాధి నివారణకు, నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలన్నారు. డీ ఎం హెచ్ ఓ యుగంధర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి బారిన పడినవారిపై వివక్షతను అంతం చెయ్యడం, వారి గౌరవాన్ని కాపాడటం అనే నినాదంతో ఈ కార్యక్రమము నిర్వహించాలన్నారు. స్పర్శ కార్యక్రమమును సమర్థవంతంగా నిర్వహించి కుష్టు వ్యాధిని పూర్తిగా పారద్రోలాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్, డిఆర్వో చంద్రశేఖర్, డిఎల్ఏ టివో డాక్టర్ ఎ.వెంకట్రావు తదితర అధికారులు పాల్గొన్నారు.





## శ్రీ గంగానమ్మ జాతరలో ఎమ్మెల్యే కుమార్ రాజా

**పామర్రు మేజర్ న్యూస్:** పామర్రుటౌన్లో జరిగిన శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుమార్ రాజా ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే కుమార్ రాజాను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కుమార్ రాజా ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో ముచ్చటిస్తూ వారికి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పార్టీ సీనియర్ నాయకులు మండ పాక శంకర్ బాబు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐను మర్యాద పూర్వకంగా కలసిన టీడీపీ నేతలు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంట సాల పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరిం చిన వేమన చందనను ఘం టసాల మండలం దాలిపర్రు గ్రామానికి చెందిన టీడీపీ నేత చిర్ల రామకృష్ణ సోమవారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. రామకృష్ణ వెంట తెనాలి ప్రతాప్, దిరిశం శ్రీనివాసరావు ఉన్నారు.

## కుల మత విద్వేషాలు రెచ్చగొడుతున్న అంబటి రాంబాబు, జోగి రమేష్పై గరిమెళ్ళ ఫైర్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని కవులూరు గ్రామంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గరిమెళ్ళ గోపాలరావు మాట్లాడుతూ అంబటి రాంబాబు జోగి రమేష్ లక్ష్మీపార్వతులను వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు దృష్ట్యా వీరి ముగ్గురిను అడ్డం పెట్టుకొని కులమత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి సంస్కృతి హేయమైన చర్యలు మైలవరం నియోజకవర్గంలో రాష్ట్రంలో ఏనాడు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది మహనీయులు సీనియర్ నాయకులు మన రాష్ట్రాన్ని పరిపాలించిన ఇటువంటి బూతు పురాణం వలగరగా మాట్లాడటం ఎన్నడూ లేదని పవిత్ర తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాలలో జంతు కబేలాల కొవ్వు కలిసిందని సిట్టు సిబిఐ విచారణ చేస్తుంటే దాన్ని తప్పుదోవ పట్టించడం కోసం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ బూతు పురాణం నాయకులను ఎక్కడికి అక్కడ ఏరియా లలో వరుసగా అల్లలు సృష్టించమని వారి అధినేత సంకేతాలు పంపించి రాష్ట్రాన్ని అభివృద్ధి కుంటుపడే విధంగా అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ చంద్రబాబు నాయుడుని నారా లోకేష్ ని నోటికొచ్చినట్లు ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడితే తెలుగుదేశం కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని ఇప్పటికే మీ నోటి దురుసు కారణంగా రాష్ట్రంలో 11 సీట్లు పరిమితం అయ్యారని ఆయన గుర్తు చేశారు. ప్రతిపక్ష హోదాలో ఉండి సమస్యలపై పోరాడలేక తమ సొంత లబ్ధి కోసం ఉనికి కోసం ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఇది ఇలాగే కొనసాగితే టిడిపి కార్యకర్తలు శ్రేణులు నాయకులు చూస్తూ ఊరుకోరని అవసరమైతే సుమోటో గా స్వీకరించి పోలీస్ శాఖ చర్యలు తీసుకోవడానికి ఏమాత్రం వెనుకంజ వేయదని ఆయన గుర్తు చేశారు ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో నియోజకవర్గాల్లో అలజడులు సృష్టించొద్దని చేతనైతే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999